క్లుప్తంగా

ఎటపాక మండల పరిషత్ సమావేశం రేపు

ఎటపాక: మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్టు ఎటపాక ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మంగళవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పెరమయ్య



పెరమయ్యను అభినందిస్తున్న నాయకులు

ఎటపాక: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా మోదుగు పెరమయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చోడవరంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకులు నోముల రామారావు, పాయం వెంకయ్య సమక్షంలో ఈఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో గంధం జయమ్మ, బొల్లా ప్రసాద్, ఉపాశంకర్, రాజు, రాంబాబు,రాజేష్ తదితరులున్నారు.

సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ సుభద్ర

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి పంచాయతీ కొత్తూరులో పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన రూ.60లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మిస్తున్నట్టు ఎంపీపీ బోయినకుమారి తెలిపారు. సర్పంచ్ కొర్రా సుభద్ర, కూటమి నాయకులతో కలసి భవనం నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ నళిని, వైస్ సర్పంచ్ రాంబాబు, వైఎస్సార్‌సీపీ యువజన సంఘం నాయకుడు అరుణ్, బాలరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

రంపచోడవరం: వివిధ పనుల మీద కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండాలని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. మంగళవారం ఆమె రంపచోడవరం మండలం బి.వెలమల కోట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సంతకాలు చేసిన సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో ఐటీడీఏ పీవో కె. సింహాచలంతో ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని అన్ని పంచాయతీల్లో గతంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల వారీగా కొన్ని గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా తీర్చిదిద్దాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమణ

రాజవొమ్మంగి : స్థానిక మోహన్‌రైస్‌మిల్లు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రాజవొమ్మంగికి చెందిన చిన్నారావు, అతని స్నేహితుడు రమణ మోటారు సైకిల్‌పై దూసరపాము నుంచి రాజవొమ్మంగి వస్తుండగా కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కుక్క మరణించగా చిన్నారావుకు స్వల్పంగా, రమణకు తీవ్రగాయాలయ్యాయి. వారిని పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రమణను మెరుగైన చికిత్స కోసం ఏలేశ్వరం తరలించారు.

దీనావస్థలో డీఆర్ డిపోలు



శిథిలావస్థకు చేరిన బోసుబెడ డీఆర్‌డీపో భవనం

అరకులోయ జీసీసీ బ్రాంచ్ పరిధిలోని అన్ని డీఆర్ డిపోల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు పెచ్చులు ఊడి మీద పడతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో రేషన్ బియ్యం, ఇతర సరుకులు తడిసి ముక్కిపోతున్నాయి. పాడైపోయిన సరుకులనే గిరిజనులకు పంపిణీ చేస్తున్నారు.



అరకులోయ డీఆర్‌డిపోలో భారీ చెట్టు

- శిథిలావస్థలో జీసీసీ భవనాలు
- పాడైపోతున్న సరుకులు
- చిన్నపాటి వర్షానికే కారిపోతున్న శ్లాబ్
- ముక్కిపోయిన వాటినే పంపిణీ చేస్తున్న సిబ్బంది

అరకులోయటౌన్: గిరిజనప్రాంత ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు గిరిజన సహకార సంస్థ ఏర్పాటు చేసిన డీఆర్ డిపోల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే కారిపోతున్నాయి.వీటిలో నిల్వ చేసిన సరకులు తడిసిపోతున్నాయి. తడిసిన, ముక్కిపోయిన సరుకులనే గిరిజనులకు పంపిణీ చేస్తుండడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

26 మెయిన్.. 48 మినీ డిపోలు

అరకులోయ జీసీసీ బ్రాంచ్ పరిధిలోని అరకులోయ, డుంబ్రిగుడ మండలాలాల్లో 26 డీఆర్ డిపోలున్నాయి. అన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటి పరిధిలో మరో 48 మినీ డిపోలను ఏర్పాటు చేశారు. మినీ డిపోల్లో సగానికి పైగా అద్దె గృహాల్లో నిర్వహిస్తున్నారు. 30,836 మంది రేషన్ కార్డుదారులతోపాటు అంగన్‌వాడీ సెంటర్లకు, మిడ్‌డే మీల్స్, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి మొత్తం 5,956.21 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఈ డిపోల్లో నిల్వచేసి, ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు. డీఆర్ డిపోల నుంచి గ్రామాలకు సరుకులు చేరవేసి, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. అయితే డీఆర్ డిపోల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిలో నిల్వ చేసిన సరుకులు పాడైపోతున్నాయని, వాటినే పంపిణీ చేయవలసి వస్తోందని ఎండీయూ వాహనాల నిర్వాహకులు, తప్పనిసరి పరిస్థితుల్లో ముక్కిపోయిన బియ్యంతోనే అన్నం వండుకుని తినవలసి వస్తోంది లబ్ధిదారులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి, కొత్తవాటిని నిర్మించాలని రేషన్‌కార్డు దారులు కోరుతున్నారు.

భయం భయంగా విధులు

భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విధి నిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు పెచ్చులు ఊడి పడతాయోనని ఆందోళన చెందుతున్నారు. గోడలు సరిగా లేకపోవడంతో పందికొక్కులు, ఎలుకలు గోతులు తీసి సరకులను పాడుచేస్తున్నాయి. వర్షాకాలంలో చాలా చోట్ల సరకులు తడిసి పోయి నష్టపోతున్నారు.

ముక్కిపోయిన సరుకులు ఇస్తున్నారు



మాగ్రామంలో సుమారు 50 ఏళ్ల కిత్రం జీసీసీ డీఆర్ డిపో భవనం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో కారిపోతుండడంతో సరుకులు తడిచి ముక్కిపోతున్నాయి. వాటినే మాకు పంపిణీ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డీఆర్ డిపో భవనాన్ని నిర్మించాలి.

– కొర్రా సొన్ను, గిరిజనుడు, బి.గంగగుడ్డి గ్రామం అరకులోయ

ప్రతిపాదనలు పంపాం



అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని 26 డిపోలకు, రెండు గోదాములకు నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. అనుమతులు రాగానే నూతన భవనాల నిర్మాణంతో పాటు మినీ డిపోల భవనాలకు మరమ్మతులు చేపడతాం.

– వి.శ్రీనివాసరావు, మేనేజర్, జీసీసీ బ్రాంచ్ అరకులోయ

సందడిగా అడవిరాజుల బాబు పండగ



థింసానృత్యంతో సందడి చేస్తున్న స్థానికులు

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజులబాబు పండగ మంగళవారం సందడిగా జరిగింది. పాతవీధి, అద్దరవీధి, నూతులు, కొడిసింగి గ్రామాల్లో ఈ పండగను ఘనంగా నిర్వహించి, పూజలు చేసి, మొక్కుబడులు సమర్పించారు. అనంతరం గిరిజనులంతా విందు భోజనాలు చేసి, ఆటపాటలతో సందడి చేశారు.

క్రికెట్ టోర్నీలో రఘు కైట్స్ జట్టు విజయం



విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తదితరులు

అడ్డతీగల: సంక్రాంతి సందర్భంగా అడ్డతీగలలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రఘు కైట్స్ జట్టు విజయం సాధించింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో దినేష్ ఎలెవెన్,రఘు కైట్స్ జట్లు తలపడగా రఘు కైట్స్ జట్టు గెలుపొందింది. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రఘు కైట్స్ జట్టుకి ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నర్స్‌గా నిలిచిన దినేష్ ఎలెవెన్ జట్టుకి రూ.20 వేలు నగదు బహుమతిని అందజేశారు. సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



తడ్డాలో విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కో–ఆర్డినేటర్ స్వామినాయుడు



కస్తుర్బా విద్యాలయంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న స్వామినాయుడు

సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ కో–ఆర్డినేటర్ స్వామినాయుడు

డుంబ్రిగుడ: టెన్త్ పరీక్షల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచి, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ కో–ఆర్డినేటర్ స్వామినాయుడు సూచించారు. స్థానిక కస్తుర్బా గాంధీ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలయ్యేలా సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గుంటసీమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని తడ్డా గ్రామంలోని ఎస్ఆర్ఎస్‌టీసీని సందర్శించిన ఆయన చిన్నారులకు అందుతున్న విద్య, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుసున్నారు. తడ్డా గ్రామానికి శాశ్వత పాఠశాల మంజూరుకు ప్రభుత్వానికి నివేదికను పంపుతానని చెప్పారు. సీఆర్పీ నాగేంద్ర, ఏఎల్‌వో కూర్మారావు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

చింతపల్లి: మండలంలో రూ. 40 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంపీపీ కోరాబు అనూషదేవి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్ తెలిపారు. కొమ్మంగి పంచాయతీ టెంకలుపాడులో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వారు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కొమ్మంగి పంచాయతీలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు ఇదే పంచాయతీ మూలగరువులో రూ.4 లక్షలతో అంగన్‌వాడీ భవన మరమ్మతులు చేపట్టనున్నట్టు చెప్పారు. రూ.10 లక్షలతో చింతపల్లిలో గల బాలసదనం భవనానికి, మరో రూ.15 లక్షలతో జిల్లా పరిషత్ అతిథి గృహానికి మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మంగి సర్పంచ్ పాంగి లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, వార్డు సభ్యుడు చల్లంగి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు పాంగి గుణబాబు, లింగన్నదొర, గణపతి, రాము, సురేష్ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి,జెడ్పీటీసీ బాలయ్యపడాల్

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం, నడింపాలెంలలో పశు వైద్యులు కె.రాజేష్ కుమార్ మంగళవారం పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాడిరైతులకు సూచించారు. రెండు వైద్య శిబిరాల్లో 50 పశువులకు చికిత్స చేశారు. 104 పశువులు, 29 పెయ్యిలు, 122 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలను వేశారు. ఈ శిబిరాల్లో పశు వైద్యులు ప్రసన్నకుమార్, శరభన్నపాలెం సర్పంచ్ కె.సత్యనారాయణ, ఉప సర్పంచ్ త్రిమూర్తులు, జేవీవో అప్పల నర్సమ్మ, శ్రీనివాస్ ఏహెచ్ఏలు పరమేష్, సుసీల, దేముడు, వెంకటరమణ పాల్గొన్నారు.

అమీనాబాద్‌లో..

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్‌లో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. 467 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 43 తెల్లజాతి పశువులు, 66 నల్లజాతి పశువులు, కోళ్లకు అవసరమైన మందులు అందజేశారు. సర్పంచ్ కించు వెంకటలక్ష్మి, పీసా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ లక్ష్మణరావు, సహాయకులు వీరబాబు, సుబ్బరాజు, రవికుమార్, రమణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



శరభన్నపాలెంలో పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

నేడు విద్యుత్ సరఫరా బంద్

అరకులోయటౌన్: స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 29వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏడీఈ అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకు(అంజోడ), సుంకరమెట్ట, హట్టగుడ ఫీడర్ల పరిధిలోని పెదలబుడు, చినలబుడు, చొంపి, సుంకరమెట్ట, శిరగాం, లోతేరు, మాదగడ, మాదల, బస్కీ, బొండాం, గన్నెల, ఇరగాయి, పద్మాపురం, కొత్తభల్లుగుడ, డుంబ్రిగుడ మండలంలోని అరకు, సంత బయలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బలపం సర్పంచ్ రమేష్‌నాయుడు

చింతపల్లి: మండలంలోని చెరువూరులో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బలపం సర్పంచ్ కె.రమేష్ నాయుడు భూమి పూజ చేసి ప్రారంభించారు. రూ. 10 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చలి బాబూరావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు వీరయ్యదొర, కార్యదర్శి చిట్టిబాబు, నారాయణరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో రవికుమార్

పాడేరు రూరల్(జి.మాడుగుల): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సంవిధాన్ గౌరవ్ అభియాన్ ఇన్‌చార్జి రవికుమార్ తెలిపారు. జి.మాడుగుల గురుకుల కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య, పలువురు బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పునఃప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: మరమ్మతులకు గురై మూతపడిన సింగన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం భవనం పిల్లర్ పడిపోవడంతో భవనం కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. దీంతో ఓ కర్రసాయంతో భవనం పడిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పీవో అపూర్వభరత్ కేంద్రాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో రూ.3 లక్షల వ్యయంతో భవనానికి మరమ్మతులు చేపట్టడంతో పాటు మరుగుదొడ్లను నిర్మించారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించిన పీవో అక్కడి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీవీ, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ మురళి, తహశీల్దార్ చిరంజీవి, సీడీపీవో విజయగౌరి, సర్పంచ్ ముచ్చిక నాగార్జున పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అన్ని అర్జీలకు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారావు

పెదబయలు: మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అన్ని అర్జీలను పరిష్కరిస్తామని తహసీల్దార్ గండేరు రంగారావు తెలిపారు. మండలంలో గత నెల నుంచి జనవరి 10 తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 2,017 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించినట్టు చెప్పారు. 1,386 అర్జీలు మ్యుటేషన్ కోసం వచ్చినట్టు చెప్పారు. పట్టాల్లో తప్పులు సరిచేయాలని 204 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. పట్టాలను ఆధార్ నంబర్‌కు అనుసంధానం, ఈ పాస్ పుస్తకాలు, నూతన ఆర్‌వోఎఫ్ఆర్ కోసం 112, రీసర్వే కావాలని 10 అర్జీలు వచ్చిట్టు తెలిపారు. ఇప్పటికి 12 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన వాటిని దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ ఏపీవోకు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

చింతూరు: వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు మండలాలకు చెందిన వీవోఏలు స్థానిక ఐటీడీఏ ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ వీవోఏల బకాయి వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో జగన్నాథంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, సుబ్బారావు, రమేష్, లక్ష్మయ్య, రత్తయ్య, దూలయ్య, రత్నకుమారి, లీలావతి, దుర్గాదేవి, అనసూయ పాల్గొన్నారు.

ఏకలవ్య భూదాతలకు న్యాయం చేయాలి



బాధితులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి భూములిచ్చిన దాతలకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.బి.పోతురాజు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ భూదాతలు చేపట్టిన దీక్ష మంగళవారం ఆరో రోజు కొనసాగింది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన పోతురాజు మాట్లాడుతూ భూదాతలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకూ సీపీఎం పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు టి. రాందాస్, దాతలు రాంచందర్, గణ పాల్గొన్నారు.

తరచూ విధులకు టీచర్ డుమ్మా

- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు
- పనస పాఠశాలపై పర్యవేక్షణ కరువు



పనస పాఠశాల వద్ద విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ పనస గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్‌రావు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, తరచూ విధులకు డుమ్మా కొడుతుండడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడంతో చేసేది లేక తమ పిల్లలు ఇళ్లకు వచ్చేశారని వారు చెప్పారు. మోహన్‌రావు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, పాఠశాలకు వచ్చిన రోజు సైతం మధ్యాహ్నం నుంచి వెళ్లి పోతున్నాడని తెలిపారు. పలుమార్లు మద్యం సేవించి పాఠశాలకు వచ్చాడని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. మా పిల్లలకు సరైన బోధన అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమేష్‌కుమార్, గణపతి, కేశవరావు,గోవింద్, వైస్సార్‌సీపీ నేత దాసులు కోరారు. ఈ విషయంపై ఎంఈవో కృష్ణమూర్తిని వివరణ కోరగా పనస పాఠశాలకు ఉపాధ్యాయుడు వెళ్లడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్టు సుజనకోట సర్పంచ్ వి.రమేష్ అన్నారు. సుజనకోటలో మంగళవారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ డాలిమ్మ,పీసా కమిటీ కార్యదర్శి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.